నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 9 జనవరి 2025 | SANGAREDDY



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని పాత తహసీల్ కార్యాలయ స్థలంలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్-నాన్ వెజ్ భవనం

మార్కెట్‌కు మోక్షమెప్పుడో ?

ఏడాదిగా ముందుకు సాగని వెజ్-నాన్‌వెజ్ సమీకృత భవనం పనులు

- మంజూరై రెండేండ్లయినా అందుబాటులోకి రాని మార్కెట్
- ప్రధాన రహదారులపైనే కూరగాయలు, నాన్‌వెజ్ విక్రయాలు
- ఇబ్బందులు పడుతున్న హుస్నాబాద్ పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు

హుస్నాబాద్‌లోని పాత తహసీల్ కార్యాలయ ఆవరణలో ఆరుబయటే చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు, మత్స్యకారులు

హుస్నాబాద్‌లోని పోలీస్‌స్టేషన్ బైపాస్ రోడ్డుకు ఇరువైపులా వెలిసిన కూరగాయలు, నిత్యావసర సరుకుల దుకాణాలు

హుస్నాబాద్, జనవరి 8: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, మండలాల ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మించ తలపెట్టిన వెజ్-నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. నిధులు మంజూరై దాదాపు రెండేండ్లకు వస్తున్నా పనులు మాత్రం పిల్లర్ల వరకే పరిమితం అయ్యాయి. ఏడాది కాలంగా కనీసం ఇసుమంత పని కూడా ముందుకు సాగకపోవడం గమనార్హం. సరిపడా నిధులున్నా అధికారులు, కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో భవన నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీంతో కూరగాయలు, చికెట్, మటన్ విక్రయించే వ్యాపారులు, రైతులు ప్రధాన రహదారులపై దుకాణాలు పెట్టుకొని విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం అంగడి వచ్చిందంటే పట్టణంలోని రహదారులన్నీ కూరగాయల దుకాణాలతో నిం డిపోతాయి. కూరగాయలు పండించే రైతులు కూడా అడ్డా లేకపోవడంతో స్థానిక దుకాణాదారులను బతిమిలాడి దుకాణాల ఎదుట కూరగాయలు పెట్టి అమ్ముకుంటున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికావడం, స్వయంగా క్యాబినెట్ మంత్రి ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ భవన నిర్మాణ పనుల్లో పురోగతి లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.2.75 కోట్ల నిధులతో శంకుస్థాపన

హుస్నాబాద్ పట్టణంలోని పాత తహసీల్ కార్యాలయ ఆవరణలో వెజ్-నాన్‌వెజ్ మార్కెట్ భవనం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రూ.2.75 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఫిబ్రవరి 8, 2022న అప్పటి ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఏడాది కాలంలో పునాదులతో పాటు పిల్లర్ల పనులు పూర్తయి శ్లాబ్ వరకు పనులు ముమ్మరంగా జరిగాయి. అనంతరం కాంట్రాక్టరు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు కుంటుపడ్డాయి. అంతలో అసెంబ్లీ ఎన్నికలు రావడం, కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఈ భవనం గురించి పట్టించుకున్న వారు కరువయ్యా రు. కనీసం మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఈ భవనం గురించి ఇప్పటి వరకు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నిధులున్నా పనులు ముందుకు సాగకపోవడంపై వ్యాపారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై కూరగాయలు, నాన్‌వెజ్ విక్రయాలు జరపడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా మంత్రి స్పందించి సమీకృత శాఖాహార, మాంసాహార మార్కెట్ భవనాన్ని పూర్తి చేసి క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభం

హుస్నాబాద్‌లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్-నాన్‌వెజ్ మార్కెట్ భవనం పనులు కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో ఆగిపోయాయి. ఇప్పటి వరకు శ్లాబ్ లెవల్ వరకు పనులు జరిగాయి. మిగులు పనుల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలోనే పనులు ప్రారంభం అయ్యేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలోనే పనులు ప్రారంభమై భవనం పూర్తి కాగానే అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నం. ఈ భవనం పూర్తయితే విక్రయాలన్నీ ఒకేచోట జరిగి ఇటు ప్రజలకు, అటు వ్యాపారులు, రైతులకు మేలు జరగనుంది.

–ఆకుల రజితావెంకట్, మున్సిపల్ చైర్‌పర్సన్ హుస్నాబాద్

అందోల్: జోగిపేటలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు

అన్నింటా కాంగ్రెస్ సర్కారు వైఫల్యం

- హామీలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతుండ్రు
- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ధ్వజం
- జోగిపేటలో మౌన ప్రదర్శన.. నిరసన ర్యాలీ
- భారీ ఎత్తున హాజరైన రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు
- రాజ్యాంగాన్ని పరిరక్షించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి

అందోల్, జనవరి 8 : హామీలు అమలులో, ప్రజాపాలన చేయడంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలం చెందిందని సంగారెడ్డి జిల్లా అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. రైతుబంధు రూ. 15వేలు చెల్లించాలని, కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలని, ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జోగిపేటలో బీఆర్ఎస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నోటికి నల్లగుడ్డలు కట్టుకుని మౌనదీక్ష, నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా చంటి క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ మోసం చేసిందన్నారు. ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయడం లేదన్నారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ ప్రశ్నిస్తే ప్రభుత్వం జీర్ణించుకోలేక అక్రమ కేసులు పెడుతున్నదని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి నియంత పాలనను ఎక్కువ కాలం సాగదన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టడం జైలుకు పంపి కక్ష సాధించడం చేస్తున్నదని, అందులో భాగంగానే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారని అందోల్ నియోజకవర్గంలో సైతం అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగం ప్రజలకిచ్చిన అధికారాలను సైతం ప్రభుత్వం తుంగలో తొక్కుతున్నదని, ఎన్నికల సమయంలో రాజ్యాం గం పుస్తకాలు చేతులో పట్టుకుని మరీ తిరిగిన కాం గ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నదని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడే ప్రసక్తేలేదన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని చంటి క్రాంతికిరణ్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మౌన ప్రదర్శన, నిరసన దీక్షకు పార్టీ శ్రేణులు, రైతులు తరలిరావడంతో జోగిపేటలోని పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాలయ్య, మాజీ జడ్పీటీసీ రమేశ్, నాయకులు లింగాగౌడ్, నారాయణ, నాగభూష ణం, వీరారెడ్డి, విఠల్, వెంకటేశం, అశోక్‌గౌడ్, బుద్ధిరెడ్డి, బస్వరాజ్, శివాజీ, శంకర్, విజయ్, శశికుమార్, నాగరాజు, రమేశ్, కృష్ణాగౌడ్, సయ్యద్, ప్రవీణ్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, మొగులయ్య, రాజు, మండలాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

అందోల్: జోగిపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

సిద్దిపేట పట్టణంలోని నాసర్‌పురా ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎన్‌సీడీ బృందం

దవాఖానలను సందర్శించిన ఎన్‌సీడీ బృందం

సిద్దిపేట, జనవరి 8: కేంద్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరుగుతున్న 'అసాంక్రమిక వ్యాధుల' జాతీయ సెమినార్‌కు హాజరైన బృందం ఫీల్డ్ విజిట్ చేసింది. సిద్దిపేట జిల్లాలో అసాంక్రమిక వ్యాధులకు అందుతున్న వైద్యసేవలను బృందం సభ్యులు పార్థసారథి సేన్ శర్మ ఉత్తరప్రదేశ్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ తెలంగాణ కమిషనర్ ఆర్వీ కర్ణన్, మినిస్టర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ మేనేజింగ్ డైరెక్టర్ ఆరాధనాపట్నాయక్, నేషనల్ హెల్త్ మిషన్ ఛత్తీస్‌గఢ్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ దయరామ్, నేషనల్ హెల్త్ మిషన్ రాజస్థాన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భారతి దీక్షిత్ , మినిస్టర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ సీనియర్ ఈఏ ఇంద్రాణి కౌశల్, ఎన్‌హెచ్ ఎం నాగాలాండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అకౌసరహి, వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీడీ కార్యక్రమ అధికారులు బుధవారం సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన ఎన్‌సీడీ సెంటర్‌ను, తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్, డయాలసిస్ సెంటర్, ములుగు, మర్కూక్, కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మామిడ్యాల, నెమటూర్, ఎర్రవల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు, బస్తీ దవాఖాన కాళ్లకుంట కాలనీ, పట్టణ ఆరోగ్య కేంద్రం నాసర్‌పురాను సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు, అందుతున్న సేవలను తెలుసుకున్నారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖాన ఆరోగ్య శాఖ అధికారుల బృందంతో కలిసి కలెక్టర్ మనుచౌదరి జిల్లాలో అసాంక్రమిత వ్యాధుల వైద్యసేవల కోసం ప్రభుత్వం కల్పించిన వైద్య సౌకర్యాలు, వైద్యసేవల గురించి బృందం సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పల్వన్‌కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ విమలాతామస్, సూపరింటెండెంట్ శాంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

- స్వయం సహాయక సంఘాల ద్వారా వెయ్యి మెగావాట్ల సోలార్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు
- వీసీలో కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ/సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 8: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యంగా స్వయం సహాయక సంఘాల ద్వారా వెయ్యి మెగావాట్ల సోలార్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు త్వరలో టెండర్లు ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. బుధవారం ప్రజాభవన్ నుంచి పీఆర్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ, ఇంధన శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, విద్యుత్ శాఖ సీఎండీలతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇంధన శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలతో ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధనతోపాటు ఆర్థికాభివృద్ధికి అవకాశాలు కల్పించాలన్నారు. నూతన విద్యు త్పాలసీ, ఇంధన, గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య గతేడాది నవంబర్ 19న ఒప్పందం కుదిరినట్లు పేర్కొన్నారు. ఐదేండ్ల లో కోటిమంది మహిళలను కోటీశ్వర్లుగా చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ క్రమంలో మహిళలకు పెద్దఎత్తున వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్న నేపథ్యంలో వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రతి జిల్లాలో 150 ఎకరాలు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలన్నారు. ఒక మెగావాట్ ఉత్పత్తికి నాలుగు ఎకరాల భూమి అవసరం ఉంటుందన్నారు. ప్రతి జిల్లాలో 150 ఎకరాల భూమి అవసరం ఉంటుందన్నారు. దేవాదాయ, అటవీశాఖ, నీటిపారుదల శాఖల పరిధిలోని భూములను గుర్తించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో స్మాల్, మైక్రో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు 4 నుంచి 5 ఎకరాల భూమి అవసరం ఉంటుందన్నారు. రాష్ట్రంలో 6.67 లక్షల ఎకరాలను ఇప్పటి వరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేయగా, ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడం లేదన్నారు. నర్సాపూర్‌లోని దేవస్థానానికి చెందిన వంద ఎకరాలు గుర్తించినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. జిల్లాలో 75 సబ్‌స్టేషన్లు ఉన్నాయని, సర్వే నంబర్ల వారీగా నివేదికలు అందజేసే విధంగా అధికారులకు సూచించినట్లు కలెక్టర్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా నుంచి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీవో జ్యోతి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

గజ్వేల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

గజ్వేల్, జనవరి 8: సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని పాత సమితి కార్యాలయంలో 1997లో ప్రారంభమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొన్నేండ్ల పాటు కో-ఎడ్యుకేషన్‌గా కొనసాగింది. అడ్మిషన్లు ఎక్కువ సంఖ్యలో వస్తుండడంతో ఈ కళాశాలను బాలుర, బాలికల కళాశాలలుగా ఏర్పాటు చేశారు. ఇరుకు గదుల్లో బోధన చేయడం ఇబ్బందిగా మారడంతో కేసీఆర్ సీఎం కాగానే సంగాపూర్ సమీపంలో బాలురకు, బాలికలకు వేర్వేగా ఎడ్యుకేషన్ హబ్‌లు నిర్మించారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి బాలుర డిగ్రీ కళాశాలలో కో-ఎడ్యుకేషన్ తిరిగి కొనసాగుతున్నది. ప్రస్తుతం గజ్వేల్ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా రావడంతో అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట డిగ్రీ కళాశాల తర్వాత జిల్లాలో రెండో అటానమస్ డిగ్రీ కళాశాలగా గజ్వేల్‌కు అవకాశం లభించింది. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(కో-ఎడ్యుకేషన్)కు అటానమస్ హోదాను కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు, గవర్నర్, ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్‌కు యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ మనోహర్ వివరాలతో కూడిన లేఖను పంపించారు. డిసెంబర్ నెలలో జరిగిన కమిషన్ సమావేశంలో ఈ మేరకు స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకున్నది. 2025-26 నుంచి 2029-30విద్యా సంవత్సరం వరకు వచ్చే ఐదేండ్లు అటానమస్ కొనసాగనున్నది. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయంప్రతి పత్తి హోదాతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది. అడ్మిషన్ ప్రక్రియ సులభతరం కానున్నది. ఈ హోదాతో కళాశాల ప్రిన్సిపాల్‌కు నిర్ణయాధికారం ఉంటుంది. అటానమస్ హోదాతో విద్యార్థులకు ప్రయోజనం ఉండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ మాట్లాడుతూ.. అటానమస్ హోదా దక్కడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

దివ్యాంగుల జాబ్ మేళాకు స్పందన

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 8: జిల్లాలోని దివ్యాంగులకు ప్రైవేటు సెక్టార్‌లో ఉద్యోగాలు ఇప్పించి వారికి ఉపాధి కల్పించడం హర్షించదగిన విషయమని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా ఉపాధి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఈ జాబ్‌మేళా ద్వారా జిల్లాలోని వివిధ కార్పొరేట్ కంపెనీల్లో వారి అర్హతల మేరకు ఉద్యోగం కల్పిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలో 32 కంపెనీలు పాల్గొన్నాయని, 200 ఖాళీల భర్తీ కోసం నిర్వహించిన జాబ్‌మేళాకు మొత్తం 156 మంది దివ్యాంగులు హాజరయ్యారని పేర్కొన్నారు. అందులో 57 మంది షార్ట్ లిస్ట్ కాగా, ఎనిమిది మందికి నియామక పత్రాలు అందజేసినట్లు చెప్పారు. జిల్లాలో దాదాపు 5 వేల పరిశ్రమలు ఉన్నాయని, వచ్చే జాబ్‌మేళాలో అన్ని కంపెనీలు పాల్గొనేలా కృషిచేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి లలితా కుమారి, జిల్లా ఉపాధి శాఖ అధికారి అనిల్ కుమారి, యూత్‌ఫర్ జాబ్స్ మేనేజర్ అశ్విన్, వివిధ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

250 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మునిపల్లి, జనవరి 8: ఏపీలోని విజయవాడ నుంచి గుజరాత్ తరలిస్తున్న అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సంగారెడ్డి జిల్లా మునిపల్లి ఎస్సై రాజేశ్ నాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేస్తుండగా విజయవాడ నుంచి గుజరాత్‌కు తరలిస్తున్న సుమారు 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. కేసునమోదు చేసి రేషన్ బియ్యాన్ని సదాశివపేట సివిల్ సప్లయ్ గోదాంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. బియ్యాన్ని పక్కదారి మళ్లిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

బాబాయ్...చలి

ఉమ్మడి మెదక్ జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- మరో నాలుగు రోజులు మరింత తగ్గే అవకాశం
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మెదక్, జనవరి 8 (నమస్తే తెలంగాణ)/జహీరాబాద్: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. సోమవారం నుంచి జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. జిల్లా వ్యాప్తంగా దట్టంగా పొగమంచు కమ్మేస్తున్నది. చిప్పల్‌తుర్తిలో అత్యల్పంగా 10.7 ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం, తెల్లవారుజామున చల్లని గాలులు వీస్తున్నాయి. ఉదయం పొగమంచు కమ్ముకుంటున్నది. ఫలితంగా రహదారులపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత పెరగడంతో దీర్ఘకాలిక రోగులతో పాటు పిల్లలు, వృద్ధు లు, మహిళలు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. మారిన వాతావరణంతో జలుబు, దగ్గు, శ్వాసకోశ సం బంధ సమస్యలు ముదురుతున్నాయి. అనారోగ్య సమస్యలతో దవాఖానలకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి బాగా ఎత్తులో ఉండడంతోపాటు ఉత్తరాది నుంచి వీస్తున్న గాలులతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి ప్రజలు గజగజ వణుకుతున్నారు. చలి నుంచి రక్షణకు చలిమంటలు కాచుకుంటున్నారు. వెచ్చదనం కోసం ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. స్వెటర్లు, మఫ్లర్లు, మంకీ క్యాపుల విక్రయాలు బాగా పెరిగినట్లు వ్యాపారులు తెలుపుతున్నారు.

మూడు రోజులుగా మెదక్ జిల్లాలో ఉష్ణోగ్రతల వివరాలు

తేదీ	కనిష్టం	గరిష్టం
3న	9.1	32.1
4న	8.4	35.7
5న	10.7	36.5
6న	11.0	35.6
7న	12.3	34.5

వైపు చలి... మరోవైపు వైరస్..

ఒకవైపు చలి తీవ్రత పెరిగింది.. మరోవైపు కొత్తరకం వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఫ్లూ లక్షణాలు ఉన్నవారు మాస్క్ ధరించాలని జిల్లా వైద్యాధికారులు సూచిస్తున్నారు. కొత్త రకం ఫ్లూలో దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కనిపిస్తోంది. బీపీ, షుగర్, మధుమేహం, క్యాన్సర్, గుండె, మూత్రపిండాలు, కాలేయ వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు ఆరోగ్యం విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

కరోనా సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నామో ఇప్పుడు కూడా అలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం చలికాలం నేపథ్యంలో వాతావరణంలో వస్తున్న మార్పులతో జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు వేధిస్తుంటాయి. పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి. వేడినీళ్లు తప్పకుండా తాగాలి. తగిన ఆరోగ్య జాగ్రత్తలతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలి.

–శ్రీరాం, డీఎంహెచ్‌వో, మెదక్

వంగపల్లి జీపీ వద్ద నిర్లక్ష్యంగా పడి ఉన్న ఈజీఎస్ నేమ్ బోర్డులు

ఈజీఎస్ నేమ్‌బోర్డులపై నిర్లక్ష్యమేలా?

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 8: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకంలో భాగంగా వివిధ ప్రదేశాల్లో చేసిన పనుల వివరాలతో కూడిన నేమ్ బోర్డుల(వర్క్ సైట్ బోర్డులు) ఏర్పాటుపై ఈజీఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉపాధి పనుల్లో పారదర్శకత కోసం పని ప్రదేశంలో కచ్చితంగా నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ చట్టంలో ఉన్నా..అవేమీ తమకు పట్టదన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తుండడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో నేమ్‌బోర్డుకు సుమారు రూ.1300 ఖర్చు చేశారు. బోర్డులను పని ప్రదేశంలో ఏర్పాటు చేయకుండా గ్రామ పంచాయతీల వద్ద నిర్లక్ష్యంగా పడేశారు. దీనికి తోడు ఈజీఎస్‌కు సంబంధించిన పనుల చెల్లింపులన్నీ గ్రామ పంచాయతీల ద్వారా జరుగుతుండగా కేవలం నేమ్‌బోర్డుల చెల్లింపులు మాత్రం కొంత మంది ఈజీఎస్ అధికారుల అకౌంట్ల నుంచి చెల్లింపులు జరుగుతున్నట్లు సమాచారం. దీనిపై పలువురు పంచాయతీ కార్యదర్శులు గతంలో ఈజీఎస్ అధికారులను నిలదీశారు. వ్యక్తిగత అకౌంట్ల ద్వారా చెల్లింపులు జరుగుతున్న క్రమంలో ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమయ్యే అవకాశాలు లేకపోలేదని కిందిస్థాయి అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈజీఎస్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పని ప్రదేశాల్లో నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు జీపీ అకౌంట్ల నుంచి నేమ్‌బోర్డుల ఖర్చులు చెల్లించాలని పలువురు కోరుతున్నారు.